కథానిక

# సర్వమంగళ

మధురాంతకం రాజారాం

అయిదేళ్ల తర్వాత గురువుగారిని కలుసుకోబోతున్నందుకు చాలా ఆనందంగా వుంది. అయితే ఈ ఆనందానికి వెనుక ఒక నీలి నీడ లేకపోలేదు. మానవ జీవితంలో అయిదేళ్ల కాలం స్వల్పమైనదేమీ కాదు. ఈ వ్యవధిలో అనుకోని విషయాలెన్నయినా జరగొచ్చు. పైగా మా వూరిని వదిలేటప్పటికే ఆయనకు అరవైయేళ్లు. సజీవులై వుంటే ఇప్పుడాయనకు... ఛీఛీ, అమంగళం శాంతించు గాక!

అతీగతీ తెలుసుకోడానికి ఉత్తరాలు రాయని నేరం నాది కాదు. గుండ్రాళ్ళను బావిలో పడేస్తే నీటి బుడగలైనా వస్తాయి. నా ఉత్తరాలకా మాత్రం రెస్పాన్సు కూడా లేకపోయింది. అయితే ఒకటి. నేను రాసింది కరెక్ట్ చిరునామా కాదేమో! ఇందుకైనా బాధ్యత నాది గాదు. గురువుగారిదే! శేష జీవితాన్ని ఆయన బళ్లారిలో గడపదల్చుకున్నారు. చిరునామా యిచ్చి వెళ్ళమని అర్థించాను. 'ఏముందీ! జీల్లా హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రికి వెనుక వైపున' అన్నారు. 'రాయవరం విశ్వపతిశాస్త్రిగారు, ఫేమస్ పొయెట్ అండ్ స్టోరీ రైటర్, బిహైండ్ ది డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్, బళ్ళారి' అంటూ నేను ఉత్తరాలు రాశాను. ఒకటి- ఆ మాత్రపు వివరాలు పోస్ట్‌మాన్‌కు చాలకపోయి వుండాలి. రెండు- తన పేరు, ప్రతిష్ఠ ఇతరులకు తెలియనీకుండా గురువుగారు అజ్ఞాతంగానైనా జీవిస్తూ వుండాలి. మూడు- ఉత్తరాలు రాసి పరిచయాలు నిలబెట్టుకోడంలోను, లేదా పెంపొందించుకోడంలోను ఆయనకు బొత్తిగా ఆసక్తి అయినా లేక పోవాలి.

అయితే నేనైనా ఇంతకాలం తరువాత శాస్త్రి గారిని చూచిరావడానికి బయల్దేరడం నిస్వార్థంగా జరుగుతున్న పనేమీ గాదు. అంతఃకరణాలు, ఆత్మీయతలు అనేవి వట్టి పడికట్టు రాళ్ల లాంటి పదాలైపోయాయి. పని గట్టుకుని వెళ్ళి ఒక వ్యక్తిని చూచి రావడానికి అవి తమంతటవే చాలడం లేదు. అందుకు మరొక ప్రబలమైన కారణం రావలసి వస్తోంది. నాకలాంటి దొకటి ఏర్పడింది. 'విజయాంధ్ర' పత్రిక ఉప సంపాదకులు కారుమంచి సుబ్బారావు గారితో నాకు చెప్పుకోదగ్గ పరిచయం వుంది. గడచిన వేసవి సెలవుల్లో నేను హైదరాబాదు వెళ్లినప్పుడు ఆయన, నేనూ హుస్సేన్ సాగర్ గట్టుపైన కూర్చుని దాదాపొక గంట సేపటివరకు సమకాలీన సాహిత్య విషయాలు ముచ్చటించుకున్నాం. అప్పుడు మాటల సందర్భంలో విశ్వపతిశాస్త్రిగారి ప్రసక్తి వచ్చింది. ఆశ్చర్యమేమిటంటే సుబ్బారావు గారాయన్ను కీర్తి శేషుల్లో జమకట్టి వుండడం! నిరుద్యోగులు ఎంప్లాయిమెంటు ఆఫీసులో పేరు 'రెన్యూ' చేయించుకున్నట్టుగా రచయితలున్నూ ఏడాది కొకటి రెండు సార్లయినా పత్రికల్లో తమ పేరు పడేటట్టు చూసుకోవాలి. శాస్త్రిగారు పాతికేళ్లకు మునుపెప్పుడో అస్త్రసన్యాసం చేసేశారు మరి! ఇదాయన కోరి తెచ్చుకున్న శిక్షే!

"అబ్బే, ఆయన జీవించే వున్నారండీ సుబ్బారావు గారూ! ప్రస్తుత నివాసం బళ్లారి. అక్కడికి వెళ్లక ముందు ఒక ప్రయివేటు హైస్కూల్లో పని చేస్తూ ఆయన మూడేళ్ల పాటు మా వూళ్లోనే వున్నారు. అప్పట్లో వీలైనప్పుడల్లా నేనాయన్ను కలుసుకుంటూ వుండేవాణ్ణి. మీరు 'కమిట్‌మెంట్' అంటుంటారు చూడండి! దాని విశ్వ రూపాన్ని నేనాయనలోనే చూచాను. తాను నమ్మిన సిద్ధాంతాలకు అంతగా కట్టుబడిన వ్యక్తి నింకొకర్ని నేను చూడనేలేదు" అన్నాను.

"అయ్యో! అట్లాగా!" అంటూ నొచ్చుకున్నారు సుబ్బారావు గారు. "మేష్టరు గారూ! మీరు మా కోసం ఓ పని చేస్తారా? ఈ శతాబ్ది మలి తరం కవుల్లో ఒకరుగా, సీనియర్ కథకుల్లో విశిష్టులుగా విశ్వపతి శాస్త్రి గారి పట్ల మాకు గౌరవం వుంది. అలాంటి పెద్దల్ని గురించి ఈ తరం వాళ్లకు తెలియవలసిన అవసరం ఎంతైనా వుందని మా నమ్మకం. మీరొకసారి శాస్త్రి గారిని కలుసుకుని ఆయన జీవితాన్ని గురించి, సాహిత్య వ్యాసంగాన్ని గురించి వివరాలు సేకరిస్తే ఆ ఇంటర్వ్యూను మేము పత్రికలో వేసుకుంటాం" అంటూ కొనసాగించి "ఖర్చులన్నీ మేమే పెట్టుకుంటాం లెండి!" అంటూ భరోసా కూడా ఇచ్చేశారు సుబ్బారావుగారు.

తీర్థానికి తీర్థము, స్వార్థానికి స్వార్థము! నా బళ్ళారి ప్రయాణం అలా సమకూడింది.

తిరుపతిలో నేనెక్కింది రాయలసీమ ఎక్స్‌ప్రెస్. ఇది తెల్లవారుజామున ఏ రెండు గంటలకో రాయచూరు చేరుకుంటుంది. అక్కడి నుంచి బళ్ళారికి బస్సులుంటాయని తెలిసింది.

నిజానికి జీవిత విశేషాల కోసం నేను శాస్త్రిగారితో కొత్తగా ఇంటర్వ్యూ జరపవలసిన పనిలేదు. స్వవిషయాలను గురించి ఏకరువు పెట్టే ఆసక్తి ఆయనకు బొత్తిగా లేకపోయినప్పటికీ నేనెట్లాగో ఒకటి, అరా వివరాలు రాబడుతూ వచ్చి ఆఖరుకు స్థూలంగానైనా ఆయన జీవిత చరిత్రను ఊహించుకోగలిగాను. శాస్త్రిగారి జన్మస్థలం శ్రీకాకుళం జిల్లాలో పలాస. చిన్నప్పుడే తల్లి చనిపోయింది. ఒరిస్సా రెవిన్యూ డిపార్టుమెంటులో తాశీల్దారుగా పని చేస్తూ వుండిన తండ్రి ఒరియా కాయస్థుల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ రెండో పెళ్ళి తర్వాత తండ్రీ కొడుకులు ముఖాలు ముఖాలు చూచుకోనేలేదంటే ఆ మాట నమ్మడానికి శక్యమైనదిగా వుండదు. అయితే అక్షరాలా నిజం. పునర్వివాహం గురించి కాదు గాని, అది సాంప్రదాయ విరుద్ధం కావడం దగ్గరే వచ్చింది పేచీ. శాస్త్రిగారు విజయనగరంలో మేనమామల యింట వుండి హైస్కూలు చదువు ముగించారు. ఉన్నత విద్యాభ్యాసం కూడా అక్కడే జరగవలసింది. కానీ ధర్మ విపర్యయమనేది ఇంట్లో జరిగి, ఊళ్లో జరగక పోవచ్చుననడానికి వీల్లేదు గదా! స్థానిక కళాశాల ప్రిన్సిపాలు గారితో శాస్త్రి గారికో గొడవొచ్చిపడింది. బ్రహ్మ సమాజానికి చెందిన ఆ ప్రిన్సిపాలు పేరు పరమహంస గారు. ఆయన కెక్కడలేని సంస్కరణల పిచ్చి. 'చాతుర్వర్ణ సమాజమూ- దాని బాగోగులు' అన్న విషయంపై ఆయన ఒక సదస్సు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో వృత్తుల్ని బట్టే వర్ణాలేర్పడ్డాయనీ, కానీ దేనికదే విడిగా గాకుండా అన్ని వర్ణాలూ ఒక సమాజంలోనే వుండి అనేక విషయాల్లో ఒకదానిపైన ఒకటి ఆధారపడి వుండడం వల్ల కాల క్రమంలో వర్ణ సాంకర్యం తప్పలేదనీ, అందువల్లనే బ్రహ్మంగారు 'ఏ కులమని నను వివరమడిగితే ఏమని తెలుపుదు లోకులకు' అంటూ నిర్వేదం ప్రకటించవలసి వచ్చిందనీ కొందరు పెద్దలు తమ శాస్త్ర పాండిత్యాన్ని, లౌకిక విజ్ఞానాన్ని కలబోసి సుదీర్ఘోపన్యాసాలిచ్చేశారు.

పరమహంసగారి ప్రియ శిష్యులు కొందరైతే మరి కొంత దూరం వెళ్లి మానవ యాత్రా ప్రస్థానం తొలి మజిలీల్లో మతాలు, కులాలు లేనే లేవనీ, చివరి దశల్లోను వుండబోవనీ, నడిమంతరపు అడ్డుగోడలు నడిమంతరంలోనే వడ్డి విరిగి నేలమట్టం కాక తప్పదనీ బహిరంగంగానే పగటి కలలు కన్నారు. అప్పటికి శాస్త్రి గారి వయస్సు పజ్జెనిమిదేళ్లే. కానీ కొదమ సింగానికి వయసుతో ఏం పని? ఆయన లేచి సదస్సు ఏర్పాటు చేయడానికి వెనుక నిర్వాహకులకు గల దురుద్దేశాన్ని చీల్చి చెండాడేశారు. అలాంటి సదస్సులు

వెయ్యి జరిగినా సనాతన ధర్మానికి వాటిల్లే సేగియేదీ వుండదని ఢంకా బజాయించి చెప్పేశారు. అంతటితో ఊరుకున్నారా? టి.సి. యిప్పించుకుని ఆ కాలేజికి స్వస్తి చెప్పేశారు. తల్లి నగలు కొన్ని మిగిలి వుంటే వాటిని తెగనమ్మి రాజమండ్రి వచ్చి అక్కడ విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. పట్టభద్రులైన తర్వాత ఉపాధ్యాయ శిక్షణ కూడా అక్కడే పొందారు. ఉద్యోగిగా చెన్న రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖలో కాలు మోపారు. క్రీడాకరుడు ఫుట్‌బాలును తన్నినట్టుగా ఆ ఉద్యోగం ఆయన్ను ఎక్కడికి పడితే అక్కడికి విసిరిపారేస్తూ వచ్చింది. ఇలా బదిలీలు ముంచుకురావడానికి కూడా ఆయన విలక్షణ వ్యక్తిత్వమే కారణమని చెప్పాలి. డి.ఇ.ఒ. గారితో ఘర్షణ, జిల్లా బోర్డు అధినేతలకు ఆగ్రహం తెప్పించడం, సహోద్యోగులతో సరిపడకపోవడం, డిపార్టుమెంటుకు ఆకాశరామన్న ఉత్తరాలు, ఎంక్వయిరీలు, బెదిరింపులు- ఇలా ఎన్నెన్నో ఆటుపోట్లకు గురవుతూ కూడా ఆయన కొన్ని దశాబ్దాల పాటు సాహిత్య వ్యాసంగం కొనసాగించారంటే, అది ఆయన ఆత్మ బలానికి నిదర్శనమని నేను భావిస్తూ వుంటాను.

నేను కాలేజీలో చదువుకునేటప్పటికే విశ్వపతి శాస్త్రి గారి పేరు సాహిత్య ప్రపంచంలో ప్రముఖంగా వినవస్తుండేది. వార, మాస పత్రికల్లో ఆయన వ్యాసాలు, కథలు, పద్య ఖండికలు, గేయ నాటికలు తరచుగా వెలువడుతుండేవి. అన్నట్టు నాకాయన పేరు బాగా గుర్తుండిపోవడానికి మరొక ముఖ్యమైన కారణం కద్దు. తొమ్మిదో తరగతి తెలుగు వాచకంలో ఆయన రచించిన చారిత్రక గాథ ఒకటి మాకు పాఠ్య భాగంగా వుండేది. పేరు సరిగ్గా గుర్తు లేదు. ధర్మచ్యుతి, ధర్మగ్లాని, ధర్మ హాని ఇలాంటిదేదో అయి వుండాలి. గ్రీకు చక్రవర్తి అలెగ్జాండరుకు ప్రతినిధిగా సెల్యూకస్ భారత దేశంలో ఒక భూభాగాన్ని పాలిస్తూ వుంటాడు. సెల్యూకస్‌కు మూడోతరం వాడు ప్రాకారియస్. ఈ ప్రాకారియస్ ముద్దుల కొడుకు ప్లాటోవ్. నూనుగు మీసాల నూత్న యౌవనుడైన ప్లాటోవ్‌కి పంచకల్యాణి గుర్రంపైన సాయంకాలాలలో షికారుకు వెళ్ళి రావడం అలవాటు. అతడు మామూలుగా షికారు వెళ్ళే చోట ఓ కొండ చరియలో చిన్న నది ఒడ్డున ఒక అందమైన దేవాలయం. శ్యామలీ చిదానందులు అక్కడ భగవత్కైంకర్యంలో నిమగ్నులై వున్న పూజారి దంపతులు. భక్తుల ద్వారా లభించే కొద్దిపాటి రాబడే వారికి జీవనాధారం. వారి ఏకైక సంతానం తరళనయన. ప్లాటోవ్ తొలి చూపులోనే ఆమెను ప్రేమిస్తాడు.. పూలు, పండ్లు, ఆభరణాలు మొదలైన



ప్రేమ కానుకలు ఆమెకు బహూకరిస్తాడు. వచ్చీ రాని ప్రాకృతంలో తన కోరికను బయటపెడతాడు. తరళనయన నిర్ఘాంత పడిపోతుంది. తన తల్లిదండ్రులు ఎంతటి నిష్ఠాగరిష్ఠులో వివరించి, వైదిక ధర్మానికి వ్యతిరేకంగా జరిగే చర్యను వాళ్ళు సహించరని హెచ్చరిస్తుంది. ప్లాటోవ్ వినిపించుకోడు. పెళ్ళి కార్యం కాస్తా జరిగిపోతే వాళ్ళు తమంతట తామే సర్దుకోగలరు లెమ్మని నచ్చజెబుతాడు. గుర్రం పైన తీసుకెళ్లి పోయి భారతీయ సాంప్రదాయానుసారం గానే ఆమెను పెళ్లాడేస్తాడు. అయితే వధువు తల్లిదండ్రుల విషయంలో అతడు వేసుకున్న అంచనా ఘోరంగా వీగిపోతుంది. తర్పణాలు వదిలిపెట్టి, పిండ ప్రదానాలు చేసి తన కూతురు చనిపోయింది పొమ్మని చిదానందుడు బహిరంగ ప్రకటన గావిస్తాడు. నిక్షేపంగా బ్రతికి వున్న కుమార్తెను చనిపోయినట్టుగా భావిస్తున్న ఆ తల్లి దండ్రుల పట్ల ప్లాటోవ్‌కి పట్టరాని ఆగ్రహం కలుగుతుంది.

ప్రతీకారం తీర్చుకోదానికన్నట్టుగా అతడు కొండచరియలో ఆ గుడికెదురుగానే ఓ భవంతి నిర్మించి, భార్యతో బాటు అందులో కాపురం పెడతాడు. ఐశ్వర్యాలలో మునిగితేలుతున్న కుమార్తెను అనుదినమూ చూస్తూ రావడం వల్లనైనా ఆ వృద్ధ దంపతుల మనసులో మార్పు రావచ్చునని ఆశిస్తాడు. కానీ ఆ ఆశ కూడా అడియాసే అయిపోతుంది. ధర్మభ్రష్టురాలైన కుమార్తెను చూస్తూ చూస్తూ జీవించడం సాధ్యంకాదనుకున్న ఆ దంపతులు విష పానం చేసి ఆత్మ హత్యకు పాల్పడతారు. జీవితం పట్ల విరక్తి చెంది తరళనయన సన్యాసినిగా మారిపోతుంది...

ఈ కథ మా క్లాసులో పెద్ద అలజడికి దారితీసింది. ముగింపు బాగుండలేదని కొందరు, ఇంతకంటె సముచితమైన ముగింపు వుండబోదని కొందరు- ఇలా తరగతి రెండు జట్లుగా చీలిపోయింది.

తెలుగు మేష్టారు చెన్నబసవప్పగారు రెండో పక్షాన్ని బలపరచడంవల్ల నేమున్నూ ఆ పక్షంలో వుండక తప్పింది గాదు. కానీ నాలో నాకు తెలియని అంతర్వాణి ఏదో అరచి, గగ్గోలుపెట్టినట్టే వుండేది. రాత్రుల్లో ఏదైనా పీడకలం వచ్చి మేలుకుంటే తరళనయన దీనవృత్తాంతం జ్ఞప్తికి

మిగతా 70 వ పేజీ

7వ పేజీ తరువాయి

వచ్చి గుండె విషాద సాగరంలా ఘూర్ణిల్లి పోయేది.


పై కథ చదువుకున్న తర్వాత ఇరవై యేళ్ళకు గానీ నేను శాస్త్రిగారిని ముఖా ముఖిగా కలుసుకోలేకపోయాను.అప్పట్లో ప్రభుత్వోద్యోగులకు ముట్టే పింఛను నామమాత్రంగా వుండేది. అందువల్ల ఒక ప్రయివేటు విద్యా సంస్థలో పనిచేయ డానికి ఒడబడి ఆయన మా వూరికి వచ్చారు. ఆ ప్రయివేటు స్కూలు వాళ్ళు గూడా మవ్యుల్ని గానుగాడివట్టు ఆయన బోధనాశక్తిని పూర్తిగా వినియోగించుకుని దయాభిక్షగా ఎంతో కొంత ప్రతిఫలం ముట్టజెప్పేవారు. ఉద్యోగం లాగే జీవితం గూడా ఆయన్ను చాలా చిన్న చూపే చూసిందని గ్రహించడానికి ఎంతో కాలం పట్టలేదు. ఇంట్లో దొంగలు పడితే కలి మిని దోచుకపోతారు. ఉత్సాహాన్ని, ఆనం దాన్ని ఎవరు దోచుకపోతారు? కాలమే దోచుకపోతుందని చెప్పాలి.పుట్టిన బిడ్డలు ముగ్గురూ కూడబలుక్కున్నట్టు ఒకరి తర్వాత ఒకరుగా కాలగర్భంలో కలిసిపోతే, వృద్ధాప్యం రెక్కలు విప్పిన రాబందులా వెన్నంటి తరుముతుంటే ఎవరి బ్రతు కైనా మరెలా వుంటుంది? బంధువులతో సంబంధాలు తెగిపోయాయి. మిత్రులవలే లేరు. పట్టించుకునేవాళ్ళు కరువై పోయారు. సాహిత్య ప్రపంచం విస్మరిం చింది. నౌకా భంగం జరిగిన తర్వాత ఒంటరి దీవిలో చిక్కుపడిపోయిన ఇద్దరు సహ యాత్రికుల్లా ఆ దంపతులు ఒకరి కొకరు తోడుగా మిగిలిపోయారు. ఎప్పుడో ఓబి కాలంలో బళ్లారి టీచర్స్ ట్రెయినింగు స్కూలులో పని చేస్తుం డగా కారుచౌకగా దొరికింది గదా అని కొనుక్కున్న ఖాళీ జాగాలో ఆయన ఒక పెంకుటిల్లు లేపి, దాన్ని నాలుగు వాటా లుగా చేసి అద్దెకిచ్చారట! లోకంతో మిగిలి వున్న లంకె అదొక్కటి మాత్రమే కాగా, ఆ బంధం ఆయన్ను బళ్లారికి లాగింది. స్టేషనులో వీడ్కోలిచ్చిన వాళ్లే నేనూ క్రిష్ణే. మూడు గోతం పంచుల పాత్ర సామగ్రి, రెండు ట్రంకు పెట్టెల బట్టలు, అయిదారు అట్టపెట్టెల్లో పుస్త కాలు- ఈ పరంజామాతో ఎండిమోడు వారిపోయిన రెండు మొక్కల్ని తొట్లల్లో పాతి, పార్సెల్ చేసి ఎక్కడికో పంపు తున్నట్టుగా, నేను వాళ్ళనిద్దర్నీ రైలెక్కించి బండి కదలే

వెళ్ళిపోయిన తర్వాత గూడా చాలా సేపటి వరకు - శరీ రంతో బాటు మనసు గూడా మొద్దుబారి పోయిన స్థితిలో- ప్లాట్‌ఫారం పైన్నే నిల్చుండిపోయాను.

* * *

బళ్లారిలో దిగేసరికి మధ్యాహ్నం కావచ్చింది. ఎందుకైనా మంచిదని హోటల్లో ఓ గది తీసుకుని, స్నానమూ, భోజనమూ కానిచ్చి, ఎండ తగ్గేదాకా విశ్రాంతి తీసుకున్నాను. ఈ లోగా గమ్యాన్ని నిర్దేశించుకోవడంలో హోటలు కుర్రాడు కొంతవరకు నాకు తోడ్పడ గలిగాడు.

"ఆస్పిటలు ఎనకాల హనుమంత రాయరు గుడి అని జెప్పండి! అడ రిక్షా దిగిపొండి! ఇంటి నంబర్లు, గింబర్లు పరిగ్గుండవు. నలానాయన ఇల్లేద అని అడగతా బోతే తెలిసినోళ్లెవురైనా జెబు తారు లెండి!"




ప్రభుత్వ అనుమతి ఒకప్పుడు బళ్లారి పట్టణానికి పడమటి శివారుగా వుండేదట! పాతకాలపు నవాబులెవరో కట్టిపెట్టిపోయిన నేలకోటలో అది ఏర్పా టయింది. హనుమంతరాయని గుడి దగ్గర నిల్చుని ఈశాన్య మూల గా చూస్తే కోటగోడ తాలూకు అవశేషాలు కనిపి స్తాయి. కందకం పూడిపోయి పెద్ద మురికి నీటి కాలువగా మారింది. పశ్చిమంగా దాక్షిణ్య కిలో మీటరు దూరంలో ఏరు లాంటిదేదో ప్రవహించేట్టుంది. దాని గట్టు పొడుగునా నిల్చున్న కొబ్బరితోటలు ఆకాశానికెత్తిన ఆకుపచ్చ తంగేడాకులా కనిపిస్తున్నాయి. రోడ్డుకు, కోటకు, కొబ్బరి తోటలకు మధ్యన వున్న స్థలం మంతా ఒకప్పుడు ఖాళీ జాగాగా వుండి వుండాలి. మిట్టలు, వర్రాలు, ముళ్ల

దుబ్బలు, సర్కారు కంప చెట్లు ఈ ఊహను బలపరుస్తున్నాయి. అల్లాఉద్దీను తన అద్భుత దీపం సహాయంతో అద్దాల మేడను సృష్టించాడని చెబుతారు. అలాంటి ఇంద్రజాలం చేతగానివాళ్ళు పొట్ట చేతబట్టుకుని ఏయే దూర ప్రాంతాల నుంచో వలసవచ్చినవాళ్ళు బ్రతుకు తెరువు కోసం ప్రకృతితోను, పరిసరాలతోను పోరాడవలసిన వాళ్లు, నగ రంలోని ఇళ్ళకు అద్దె చెల్లించుకోలేక సువిశాల భూతలంపైన తమకంటూ స్వంతంగా ఏ మాత్రపు జాగా వున్నా చాలుననుకునేవాళ్ళు తాత్కాలికమైన ఆవాసాలు ఏర్పాటుచేసుకుని అక్కడ స్థిర పడిపోయినట్టున్నారు. పాకలుగా, గుడి సెలుగా, కొట్టాలుగా విస్తరించిన ఆ వూరి చివరి వాడలో పెంకుటిళ్లు, సిమెంటు కట్టడాలు చాలా పల్చగా మాత్రమే కానవస్తున్నాయి. శాస్త్రిగారిది

నాలుగు వాటాలున్న పెంకుటిల్లు గదా, ఆ 'క్లూ' మాత్రమే ఆధారంగా సందుల్లో నడుస్తూ, గొందుల్లోకి మళ్లుతూ ముందుకు సాగిపోతున్నాను. లేమి వుండొచ్చు. బ్రతుకు బరువులుండొచ్చు. ఈతి బాధలుండొచ్చు కానీ అక్కడ జీవన సంరంభానికి లోటు లేదు. కన్నడంతో బాటు తెలుగు, తమిళం, హిందీ, మరాటీ... ఇంకా నాకు తెలియని భాష లేవో వుండి వుండి చెవిలో పడుతు న్నాయి. సందు మొగదలలో భజన గుడిగా రూపుదాల్చిన గారమిద్దె. దానికి కూతవేటు దూరంలో మసీదుగా రూపాంతరం చెందిన బండల కట్టడం. దానికి కొంత దూరంలో శిలువను తల పైన మోస్తూ చర్చిగా మారిన పూరిల్లు. ప్రాంతాలు, భాషలు, మతాలు, కులాలు

వేరైనా 'మనమంతా మానవులం' అన్న ఒకే ఒక సిద్ధాంత ప్రాతిపదికపైన అక్కడ జనం ఒక పెద్ద తండాగా చేరి పోయినట్టున్నారు. శాస్త్రిగారిల్లెక్కడ అని వాకబు చేయకుండానే నేనొక అరగంట సేపు ఆ వాడంతా వెదతిరిగేశాను. ఎందుకు వాకబు చేయలేదని అడ క్కండి! ఎలాంటి సమాధానం వినవలసి వస్తుందో నన్నదే నా భయం!

చివరికి వెదకబోయిన తీగ కాలికే తగిలింది. పెంకుటింటి ముందు నిలబడి 'విశ్వపతి శాస్త్రిగారి ఇల్లిదే గదండీ?' అని అడిగాను. మూడో వాటాలోని వ్యక్తి తొంగి చూచి 'ఇదేనయ్యా! ఆ మొదటి దర్వాజాగుండా లోనికి వెళ్లండి' అన్నాడు.

నేను లోపల అడుగుపెట్టాను. వసా రాలోకి వెళ్లి నిల్చున్నాను. హాల్లోపలికి తొంగి చూశాను. కానీ అది శాస్త్రిగారి నివాసమంటే మాత్రం నమ్మలేక పోయాను. మెరుగు మాయని స్టీలు కుర్చీలు, కాశ్మీరు దృశ్యాల చిత్ర పటాలు, మూలలకున్న మచ్చులపైన

చిన్న సైజు అజంతా శిల్పాలు, టేప్‌రి కార్డరులో నుంచీ సన్నటి సంగీతం- అబ్బే, యివన్నీ గావు నా కాశ్చర్యం కలిగించినవి! హాలుకు మధ్యగా చిన్న సిరిచాప. దానిపైన వలయాకారపు పట్టాల వెంట పరుగెత్తే రైలు బండి, జానెడెత్తున్న ఒక రంగుల రాట్నం, కాళ్లు సాచుకున్నట్టుగా కూచున్న ఓ రబ్బరు బుల్లి పాప,- ఊహూ, ఇవి గూడా కావు నాకాశ్చర్యం కలిగించినవి!- ఆ బొమ్మల నడుమ సజీవ శిల్పంలా వున్న ఓ మూడేళ్ల పసిపాప. తళుక్ తళుక్కుమంటూ చెవులకు చిన్ని లోలక్కులు. మెడలో సన్నటి డాలరు చైను. రెండు జడల్నీ తోరణంలా కలుపు తున్న మల్లెపూలు, నీలికాంతులు చిప్పిల్లు తున్న కళ్లు. మోకాళ్ల కిందికి వస్తున్న పావడాపైన కుచ్చులు పోసి కుట్టిన గౌను వేసుకున్న ఆ పసిపిల్ల నన్ను చూడగానే తటాలున లేచి నిల్చుని 'తాతయ్యా! ఎవులో వచ్చాలు! అమ్మమ్మా! ఎవులో వచ్చాలు' అంది. అమ్మాయి నోట మాట పెకలడంతోటే గదిలో నుంచీ శాస్త్రిగారు, వెనుక వైపు పెరట్లో నుంచీ ఆయన భార్య ఇంచుమించు ఒకేసారిగా హాల్లోకి వచ్చేశారు. "ఎవరూ! రాజశేఖ రమా! అరరే, ఎన్నాళ్లకెన్నాళ్లకు? ఎప్పు డొచ్చావు బాబూ? రా కూచో... అలా

చూస్తూ నిల్చుంటావేమే! అబ్బాయికి మంచినీళ్లు తెచ్చి యివ్వరాదూ..." శాస్త్రి గారిలా పరామర్శలు గుప్పిస్తూనే వున్నారు. నా ధ్యాస మాత్రం గులాబీ బుగ్గల ముద్దుల పాప పైన్నే వుంది.

"ఈ పిల్ల సంగతేనా! నేను చెబుతాగా!" అని తాళజెప్పి, మళ్లీ "ఎప్పుడొచ్చావు? ఎక్కడ దిగావు? అయ్యో, నేనీ ఊళ్లో వుండగా నువ్వు హోటల్లో దిగడమేమిటి? అన్నట్టు మీ అమ్మగారు బాగున్నారా? తమ్ముళ్లేం చేస్తున్నారు? చెల్లెలికి పెళ్లయిందా? ఎక్కడిచ్చారు..." అంటూ యోగక్షేమాలన్నీ అడిగి తెలుసుకున్న తర్వాత ఆయన అసలు విషయంలోకి వచ్చారు.

"ఏం చెప్పమంటావులే రాజశేఖరం! పెద్దలు దైవ ఘటన అంటుంటారు గదా! అదే జరిగింది. ఓ రోజు తెల్లవారు జామున నేను బయటికి వెళ్లి తిరిగొస్తున్నాను. కంప చెట్ల కింద పిచ్చి మొక్కల నడుమ మంచో సన్నటి ఎలుగుతో కీచు కీచుమంటూ ఏడుపు వినిపించింది. ఏమిట్రా యిది అనుకుంటూ వెళ్లి చూద్దునుగదా, చుట్టబెట్టిన బట్టల్లో పసి నిసుగు కంటపడింది. ఏం చేస్తాం? అలా వదిలెయ్యగలమా! ఇంటికి తీసుకొచ్చి మా ఆవిడకప్పగించాను. ఆ తరువాత బాధ్యతంతా ఆమెదే!"

ఆయన ఇంకా ఏమిటో చెప్పుకపోతున్నారు. నేను కూడా వింటూనే వున్నా ఆ మాట లేవీ అర్థం కాని స్థితిలోకి చేరుకున్నాను. నిండు పున్నమినాటి చంద్ర బింబంలాంటి ఏకైక సత్యమేదో ఆ క్షణాల్లో నాకు స్ఫురించినట్టై మనసులో ఏవో ఆనంద సాగరాలు ఉప్పొంగిపోతున్నట్టున్నాయి. ఉన్నట్టుండి ఆ తన్మయత్వంలో నుంచీ తేరుకుని నేను ప్రశ్నించాను- "అమ్మాయికేమని పేరు పెట్టారండీ మేష్టరుగారూ?"

"సర్వమంగళ" అన్నారు విశ్వపతి శాస్త్రిగారు. ●

## ప్రభుత్వాలు - కలక

ఓ పల్లెటూరి ఆసామి నిట్టూర్పు:
"ఏమిటో ఈ సంవత్సరం
వర్షాలు - కండ్ల జబ్బులు,
కేంద్ర ప్రభుత్వం - రాష్ట్ర ప్రభుత్వంలా ప్రజల్ని పట్టిపీడిస్తున్నాయి!"

—ఇ.వి. రమణ

## షిడేలు రాగాలు

అశ్వత్థామ పాండవ శిబిరానికి ఎదురుగా వున్న ఒక వటవృక్షం క్రింద కూర్చుని నిదురపోకుండా ఆలోచిస్తూ వుంటాడు. అప్పుడు అక్కడ గుడ్లగూబ ఆ చెట్టు మీద నిద్రపోతూ వున్న కాకులని చంపుతూ వుంటుంది. క్రోధ వివశుడై వున్న అశ్వత్థామ దానిని చూసి "ఇవ్విహంగము ముపదేశమిచ్చె నాకు" అని నిద్రపోతూ వున్న ఉపపాండవులని కృప, కృతవర్మలు వద్దు అన్నా కూడా చంపుతాడు.

ఈ కథా భాగం భాగవతంలో లేదు. అలాగే ఈ తలలు ఖండించి తెచ్చి ఇవ్వడం భారతంలో లేదు. కానీ, సంస్కృతాంధ్ర భాగవతాలలో వున్నది. సంస్కృత భారతంలోనూ, తెలుగు భారతంలో కూడా పాంచాలి ప్రతిజ్ఞ చేస్తుంది. భీముణ్ని...అశ్వత్థామను పరాభవించడానికి ప్రోత్సహిస్తుంది. కానీ భాగవతంలో ఇదేమీ లేదు. ఆవిడ కేవలం పుత్ర శోకానల దందహ్యమానయై వున్నది. అర్జునుడు ఆమెను ఓదార్చి ప్రతిజ్ఞ చేస్తాడు. భారతంలో అశ్వత్థామను భీముడు వెంబడిస్తాడు. తిక్కనగారు "ఓరీ ధాత్రీసురాధమా!" అని "క్రూర కర్మ కపట ధార్మిక" అని తిడతాడు. భారతంలో పాండవుల మీదికి అశ్వత్థామ "బ్రహ్మ శిరోనామకాస్త్రం" ప్రయోగిస్తాడు. "అపాండవం అవుగాక" అని అశ్వత్థామ శపిస్తాడు. అప్పుడు అర్జునుడు కూడా బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రయోగిస్తాడు. వ్యాసుడు, నారదుడు ఉభయుల్ని అస్త్రాలను ఉపసంహరించమని కోరగా... అర్జునుడు ఉపసంహరిస్తాడు. అశ్వత్థామ ఉపసంహరించలేకపోతాడు. అతడి శిరోమణిని పాండవులకిప్పిస్తాడు శ్రీకృష్ణుడు. అశ్వత్థామ మత్సరంతో బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని పాండవ పత్నీ గర్భములు దహించునట్లు ప్రజ్వలింపజేస్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఉత్తరా గర్భాన్ని రక్షిస్తానని ప్రతిజ్ఞ చేసి అశ్వత్థామకు మూడు వేల ఏండ్లు దుర్గంధ రక్తంబున అరగంబు దిగ్గంబు అగుచుండ తిరుగుచుండమని శపిస్తాడు. వేదవ్యాసుడు కూడా శ్రీకృష్ణుడి శాపానికి తథాస్తు పలుకుతాడు. భాగవతంలో శ్రీకృష్ణుని ఆజ్ఞచేత ఇరువురి అస్త్రాలని అర్జునుడే ఉపసంహరింపజేస్తాడు. వ్యాసుడు మధ్యవర్తిత్వం నెరపుతాడు. అశ్వత్థామ శిరోమణిని పాండవులకిచ్చి వెళ్ళిపోతాడు. భాగవతంలో ద్రౌపది ద్రోణ కుమారుడిని ఉద్దేశించి వరుసగా నాలుగు పద్యాలు చెపుతుంది. ములుకులైన ఆమె పలుకులే అశ్వత్థామకి శిక్ష. అయితే చూపదగిన అకృత్యం చేసినా విప్రజాతిని చంపకూడదని అర్జునుని చేత చెప్పిస్తాడు.

పరీక్షిత్తు గురించిన కథ సంస్కృత ఆంధ్ర భారతాలలో వుంది. ఇదే వృత్తాంతం భాగవతంలో కూడా వుంది. వ్యాసుడు పాండవ నిర్మూలనం కొరకు ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించి వారికి శిరోరత్నం ఇమ్మని అశ్వత్థామను కోరతాడు. అశ్వత్థామ కుటిలుడై సకల గర్భ విధ్వంసనం చేయాలనుకొంటాడు. దాన్ని గురించి శ్రీకృష్ణుడు కోపగించి ఉత్తర గర్భ రక్షణ భారాన్ని తను స్వీకరిస్తాడు. ఆంధ్ర మహాభారతంలో వ్యాసుడు,అశ్వత్థామల సంభాషణ విన్న శ్రీకృష్ణుడు తన అస్త్ర ప్రయోగం నుంచి ఉత్తర గర్భాన్ని వదిలివేయమని

> సంస్కృతాంధ్ర భారత భాగవతములు సదృశ విషయ పరిష్కార వివేచన డాక్టర్ సప్ప వేణుగోపాల రావు

కోరగా అశ్వత్థామ దాన్ని కూడా నాశనం చేస్తానని కృష్ణుడితో సవాల్ చేస్తాడు. పరీక్షిత్తు జననానికి ముందు శ్రీకృష్ణునికి, వ్యాసునికి, అశ్వత్థామకి మధ్య రకరకాల కథ నడిచింది. సంస్కృత భారతంలో అశ్వమేథపర్వంలో అభిమన్యుని పుత్రుని బతికించమని కుంతి, సుభద్ర, ఉత్తర శ్రీకృష్ణుని ప్రార్థిస్తారు. శ్రీకృష్ణుడు చనిపోయిన ఉత్తర కొడుకుని బతికిస్తాడు. శ్రీకృష్ణుడు, తెలుగు భారతంలో ఈ సన్నివేశంలో తనను గురించి, తనలోకోత్తరత గురించి చెప్పుకుంటాడు.

సగఱ యెడనైన నే బొంకు పలుకనేని
సమర ముఖమున నెన్నడు జలితవృత్తి
బిరిది కడుగిడనేని యిప్పిన్న వాని
యంగమున జీవమీ ప్రొద్దుయాన హిల్లు
మహిత సత్యంబు బరమధర్మంబుగాఢ
నిర్మల బ్రహ్మచర్యంబు నిత్య సంప్ర
తిష్ఠితంబులై నాయందు దేజరిల్లు
నేని నిబ్బాలునకు జీవమిపుడవచ్చు

సంస్కృత భాగవతంలో శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని సంధించి అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రం నుండి ఉత్తర గర్భాన్ని రక్షించాడని వుంది. అప్పుడు పరీక్షిత్తు జాతకాన్ని పరీక్షించి, తక్షకుడి చేత పరీక్షిత్తు మృతి చెందుతాడని చెపుతారు. ధర్మరాజు సంస్కృత భాగవతం ప్రకారం కృష్ణ నిర్యాణాన్ని గురించి విని విచారించి దేహ త్యాగం చేయ నిర్ణయించి పరీక్షిత్తునకు పట్టాభిషేకం చేస్తాడు. పోతనగారి తెలుగు భాగవతంలో ఉత్తర రథారోహణం చేయనున్న వాసుదేవుని తన గర్భాన్ని కాపాడమని ప్రార్థిస్తుంది. ఇక్కడ పోతనగారు చెప్పిన పద్యం ప్రశస్తమైనది.

మ!! సకల ప్రాణి హృదంతరాళముల
భాసజ్జ్యోతియై యుండు మూ
ర్తిమంకళుండచ్యుతు డయ్యెడన్ విరట
మాల్ గర్భంబు, దా, చక్ర హ
స్తకుడై వైష్ణవ మాయ గప్పి కురు
సంతానార్థియై యడ్డమై
ప్రకటస్ఫూర్తి నడంచె, ద్రోణ తనయు
బ్రహ్మాస్త్రమున్ లీలతోన్.

అంటే వైష్ణవ మాయతో బ్రహ్మాస్త్రాన్ని అణచి వేశాడని అర్థం. తెలుగు భాగవతంలో శ్రీహరికి బ్రహ్మాస్త్రాన్ని నిరర్థకం చేయడం విచిత్రం కాదు అని నిరూపిస్తాడు. ఉత్తర గర్భంలో వున్న పిల్లవాడు అశ్వత్థామ వేసిన బాణంవల్ల ఉత్తర గర్భంలో కలిగిన వేడికి

"కుయ్యిడ శక్తిలేదు, దరగోళము లోపల
మున్నవాడ, ది
క్కెయ్యది, దా, ననాథ ననియెప్పుడు
దల్లిగణింప నిందు, నే
డియ్యుషుపహ్ని నాయుటకు నెయ్యది
మార్గము, నన్ను గావవే......

అని తల్లడిల్లుతుండగా హరి గదా దండంతో బ్రహ్మానామకాస్త్రాన్ని, దాని వేడిని నెరచి కుర్రవాణ్ణి రక్షించి ఆనందం కలిగించాడు. ఇందులో (తెలుగు భాగవతంలోని) విశిష్టత ఏమిటంటే గర్భంలోని శిశువు విష్ణువుని ప్రార్థించడం, ఆయన ఉత్తరా గర్భ ప్రవేశం చేసి గద తిప్పి అస్త్రాన్ని నెడగొడతాడు. తరువాతి కథ అంతామామూలే!

'భీష్మ కృష్ణ సమావేశం భారత భాగవతాలలో ఎలా వుందో తరువాత చూద్దాం!

(—పురాణం)